# ఆగ్రోస్ టెండర్లలో అరాచకం!

- ధాన్యం పరికరాల కొనుగోలు టెండర్లలో బాగోతాలు
- నిబంధనలకు విరుద్ధంగా టెండర్ బాక్స్ సీల్ తొలగింపు
- గడువు ముగిసిన తరువాత బాక్స్ సీల్ తీయించి దరఖాస్తు.. ఆ తర్వాత టెండర్ బాక్స్‌కు మళ్లీ సీల్
- ఓ కీలక రాజకీయ నేత బరితెగింపు
- 'నమస్తే తెలంగాణ'కు చిక్కిన ఫొటోలు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలుకు అవసరమైన పరికరాల కోసం ఆగ్రోస్ సంస్థ పిలిచిన టెండర్ల వ్యవహారంలో అరాచకపర్వం వెలుగుచూసింది. టెండర్ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరికి టెండర్ బాక్స్ సీల్‌ను కూడా తొలగించి, తన మనుషుల చేత టెండర్లు వేయించి, మళ్లీ సీల్ వేయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఒక రాజకీయ నేత హస్తం ఉన్నట్టు, ఆయన కనుసన్నల్లోనే ఈ తతంగం జరిగినట్టు తెలుస్తున్నది.

యాసంగి ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో టార్పాలిన్స్, ప్యాడీ క్లీనర్స్, వేయింగ్ మిషన్లు, కాలిపర్స్ తదితర పరికరాల కొనుగోలు కోసం ఆగ్రోస్ సంస్థ టెండర్లు ఆహ్వానించింది. ఈ టెండర్లను దక్కించుకునేందుకు సదరు రాజకీయ నేత చక్రం తిప్పినట్టు తెలిసింది. తనకు సంబంధించిన వారి ద్వారా కొన్ని కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని, వారితో టెండర్లు వేయించినట్టు తెలిసింది. టెండర్ దాఖలుకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా పలువురు బిడ్డర్లు తమ దరఖాస్తులను టెండర్ బాక్స్‌లో వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సమయం ముగిసిన వెంటనే నిబంధనల ప్రకారం అధికారులు బాక్స్‌కు సీల్ వేశారు. అయితే, సదరు రాజకీయ నేతకు సంబంధించిన ఒక బిడ్డర్ గడువు ముగిసిన తరువాత 3:35 గంటలకు టెండర్ దాఖలు చేసేందుకు వచ్చారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తరువాత దరఖాస్తులను స్వీకరించకూడదు. కానీ, ఆ బిడ్డర్ కోసం ఒక ఆయా చేత టెండర్ బాక్స్ సీల్‌ను తొలగించి, ఆ బిడ్డర్ తెచ్చిన దరఖాస్తును అందులో వేయించినట్టు తెలుస్తున్నది. ఆ తరువాత యథాప్రకారం టెండర్ బాక్స్‌కు సీల్ వేయించారు. ఇందుకు సంబంధించి 3:36 నిమిషాలకు ఆమె టెండర్ బాక్స్‌లో దరఖాస్తులు వేస్తున్న ఫొటో, వీడియో 'నమస్తే తెలంగాణ'కు చిక్కింది. దీనిపై పలువురు బిడ్డర్లు అక్కడే అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అంతేకాకుండా, ఆగ్రోస్ సంస్థ చైర్మన్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు కూడా చేసినట్టు సమాచారం. దీనిపై చర్యలు తీసుకోవాలని బిడ్డర్లు డిమాండ్ చేసినట్టు తెలిసింది. సదరు నేత అరాచకాలపై ప్రభుత్వం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.



టెండర్ సమయం ముగిసిన తర్వాత సీల్ తీసి దరఖాస్తును బాక్స్‌లో వేస్తున్న ఆయా

# ఆగ్రోస్‌లో 10% కమీషన్ దందా!

> మొదటిపేజీ తరువాయి...

మొత్తం ప్రభుత్వం నుంచి విడుదలైనట్టు సమాచారం. ఆయా బిల్లులు చెల్లించేందుకు సదరు నేత కాంట్రాక్టర్లను 10% కమీషన్ డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోపాటు తాజాగా యాసంగి కొనుగోళ్లకు అవసరమైన పరికరాల సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో టెండర్ దక్కాలంటే ముందుగానే 10% కమీషన్‌కు ఒప్పందం చేసుకోవాలని, లేదంటే కాంట్రాక్టు దక్కకుండా చేస్తానని సదరు నేత హెచ్చరించినట్టు సమాచారం. ఈ విధంగా పాత బిల్లుల చెల్లింపులకు, కొత్త టెండర్లలో అవకాశం కల్పించేందుకు 10% కమీషన్‌ను లింకు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలో పాత సరఫరాదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకున్నా రైతులకు ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతో రెండేండ్లుగా పరికరాలు సరఫరా చేస్తున్నామని, తీరా ఇప్పుడు బకాయిలు చెల్లించకుండా టెండర్లలో అవకాశం ఇవ్వకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది.


### రైతుల కష్టాన్ని పణంగా పెట్టి.. కమీషన్ల కక్కుర్తి

నెల క్రితమే యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనా, ఇప్పటివరకు కొనుగోళ్ల కేంద్రాలకు అవసరమైన టార్పాలిన్స్, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లు, ఇతర పరికరాలు చేరలేదు. టార్పాలిన్స్ లేకపోవడంతో అకాల వర్షాల కారణంగా రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట నీళ్లపాలవుతున్నది. ఈ పాపానికి ఆగ్రోస్ కారణమనే విమర్శలున్నాయి. పరికరాల సరఫరాకు సంబంధించి ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలకు పరికరాల సరఫరా నిలిచిపోయింది. కమీషన్లకు కక్కుర్తిపడిన అధికారులు, సదరు నేత కమీషన్ ఇచ్చిన వారికే టెండర్ దక్కేలా నానా తంటాలు పడుతున్నారని, ఇందులో భాగంగానే టెండర్లను మూడుసార్లు పొడగించారనే ఆరోపణలున్నాయి. రైతులు ఏమైనా ఫర్వాలేదు.. తమకు కావాల్సింది కమీషన్లు అన్నట్టుగా సదరు నేత వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నయా దందాకు శ్రీకారం!

ఆగ్రోస్‌లో కమీషన్ల దందా సాగిస్తున్న సదరు రాజకీయ నేత.. తాజాగా మొత్తం పరికరాల సరఫరానే తన గుప్పిట్లో పెట్టుకునే ఎత్తుగడకు శ్రీకారం చుట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఇటీవల పలు రాష్ర్టాల్లో పర్యటించిన సదరు నేత అక్కడి కంపెనీలతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నట్టు సమాచారం. సదరు కంపెనీల పరికరాలను ఇక్కడ తమ పేరిట సరఫరా చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో తమకు సంబంధించిన కంపెనీకే టెండర్ వచ్చేలా రంగం సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతరులెవ్వరినీ టెండర్ దాఖలు చేయకుండా కట్టడి చేస్తున్నట్టు తెలిసింది.

## లోకం పోకడ




మీ అన్నయ్య మార్నింగ్ వాక్ చేస్తున్నాడు వదినా!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నిజామాబాద్ | 42.2°c | 22.5°c |
| రంగారెడ్డి | 41.6°c | 19.3°c |
| ఆదిలాబాద్ | 41.0°c | 23.4°c |
| మెదక్ | 39.4°c | 27.3°c |
| వరంగల్ | 39.0°c | 24.0°c |
| మహబూబ్‌నగర్ | 39.0°c | 29.0°c |
| నల్లగొండ | 38.5°c | 24.5°c |
| ఖమ్మం | 38.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 37.4°c | 22.5°c |
| కరీంనగర్ | 36.0°c | 26.0°c |



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరుపుతున్న ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు

# ఆర్టీసీ సమ్మె వాయిదా!

- సమ్మె నిర్వీర్యానికి సర్కారు కుయుక్తులు
- కార్మిక సంఘాలను విభజించి, విడివిడిగా చర్చలు జరిపిన పొన్నం
- కూనంనేని, కోదండరాం నేతృత్వంలో సమస్యలు పరిష్కారం కాకపోతే తప్పక సమ్మెకు వెళ్తాం: ఆర్టీసీ జేఏసీ
- అంతవరకు వెళ్లనివ్వం.. సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి పొన్నం హామీ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): రెండ్రోజుల నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలను గ్రూపులవారీగా విభజించి.. చర్చలు జరిపిన ప్రభుత్వం సమ్మెను వాయిదా వేయించడంలో సఫలమైంది. కార్మిక సంఘాల్లో ఐక్యత లోపించడం ప్రధాన కారణమైతే.. దానిని అదునుగా చేసుకొని, ప్రభుత్వానికి అనుకూలమైన సంఘాలతో చర్చలు మొదలుపెట్టి.. విడతలవారీగా ఆయా సంఘాలతో చర్చించి.. మంగళవారం సమ్మె నోటీసులు ఇచ్చిన కార్మిక సంఘాలను కూడా సమ్మె వాయిదాకు ఒప్పించింది. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలను సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడించారు. ప్రభుత్వ హామీలకు కార్మిక జేఏసీ అంగీకారంతో సమ్మె వాయిదా పడినట్లు ప్రభుత్వ వర్గాలు, ఆర్టీసీ కార్మిక సంఘాలు ప్రకటించాయి.

### క్రమశిక్షణ చర్యలు లేకుండా చేస్తాం..

చర్చల సందర్భంగా ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి, యూనియన్లకు ఎన్నికలు నిర్వహించాలని మంత్రిని జేఏసీ కోరింది. ఆర్టీసీని విలీనం చేయాలని కోరగా.. ఈ రెండు ప్రధాన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్లను అనుమతిస్తామని హామీ ఇచ్చారు.

### సింగరేణి కార్మికుల్లా రెగ్యులర్ టైమ్ స్కేల్..

బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో అపాయింట్ చేసే ఉద్యోగులను కన్సాలిడేటెడ్ పే విధానంలో రిక్రూట్ చేస్తున్నారని జేఏసీ నాయకత్వం మంత్రి దృష్టికి తీసుకువెళ్లింది. దీనిపై మంత్రి స్పందిస్తూ సింగరేణి కాలరీస్‌లో లాగా కార్మికులకు రెగ్యులర్ టైమ్ స్కేల్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీకి సబ్సిడీపై నేరుగా ఇవ్వాలని కేంద్రప్రభుత్వానికి ఒక నోట్ పంపినట్లుగా మంత్రి తెలిపారు. ఆర్టీసీ అన్ని క్యాటగిరీల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు.

### సమ్మె వాయిదా వేసినందుకు కృతజ్ఞతలు

సమ్మెను వాయిదా వేసుకోవాలని మంత్రి కోరారు. మంత్రి, ముఖ్యమంత్రిపై నమ్మకముంచి సమ్మెను వాయిదా వేసుకుంటున్నట్లు జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కే హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బీ యాదగిరి తెలియజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెకు వెళ్తామని జేఏసీ స్పష్టం చేసింది. ఎమ్మెల్యేలు కూనంనేని, మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాంలకు మంత్రి పొన్నం, జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్చల్లో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, టీఎంయూ అధ్యక్షుడు ఏఆర్ రెడ్డి, టీజేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు డీవీకే రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ జీపీఆర్ రెడ్డి, ఎన్ఎంయూ నాయకులు వీ బాబు, బీకేయూ నాయకులు ఏ రాములు పాల్గొన్నారు.

# లక్ష్యం కొండంత.. కొన్నది కొసరంత!

- యాసంగి ధాన్యం కొనుగోళ్లలో పౌరసరఫరాల సంస్థ తీవ్ర నిర్లక్ష్యం
- కొనుగోలు లక్ష్యం 70 లక్షల టన్నులు
- ఇప్పటివరకు కొన్నది 26 లక్షల టన్నులే
- నెల రోజుల్లో ముగియనున్న కొనుగోళ్లు
- లక్ష్యం చేరడం కష్టమేననే అభిప్రాయాలు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఈ సీజన్ ధాన్యం కొనుగోళ్లలో లక్ష్యం కొండంత ఉంటే.. పౌరసరఫరాల సంస్థ ఇప్పటి వరకు కొనుగోలు చేసింది కొసరంత మాత్రమే. 70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ ఇప్పటి వరకు 26 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. ఇది లక్ష్యంలో మూడో వంతు మాత్రమే కావడం గమనార్హం. ధాన్యం కొనుగోళ్లలో పౌరసరఫరాల సంస్థ నిర్లక్ష్యానికి ఈ అంకెలే నిదర్శనం. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### నెల రోజులే గడువు.. లక్ష్యం చేరేనా?

వాస్తవానికి ఈ సీజన్‌లో 127 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. అయితే సివిల్‌సప్లై శాఖ మాత్రం 70 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నది. అంటే ఇంకా 57 లక్షల టన్నుల ధాన్యం రైతులు ఎక్కడ అమ్ముకోవాలి, ఎలా అమ్ముకోవాలనేది ప్రశ్నార్థకం. ఇదిలా ఉంటే కనీసం పెట్టుకున్న లక్ష్యాన్ని అయినా చేరుతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మార్చి 20 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అంటే ఇప్పటికే నెలన్నర గడుస్తున్నది. మరో నెల మాత్రమే ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంది. గడిచిన నెలన్నరలో కొనుగోలు చేసింది 26 లక్షలే.. దీంతో లక్ష్యం చేరాలంటే మిగిలిన నెల రోజుల్లో 44 లక్షల టన్నులు కొనుగోలు చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో నెల రోజుల్లో ఇంత భారీ మొత్తంలో ధాన్యం కొనుగోలు సాధ్యమవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ సీజన్‌లో పెట్టుకున్న లక్ష్యం నెరవేరడం కష్టమేననే అభిప్రాయాలు పౌరసరఫరాల సంస్థ అధికారుల్లోనే వ్యక్తమవుతున్నాయి.

### కావాలనే కొనుగోలు ఆలస్యం చేస్తున్నారా?

ధాన్యం కొనుగోళ్లలో అడుగడుగునా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు లేవు, ప్యాడీ క్లీనర్లు లేవు, ధాన్యం ఎత్తేందుకు హమాలీలు లేరు, రవాణా చేసేందుకు లారీలు లేవు.. ఇలా ధాన్యం కొనుగోళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయి. అయితే వీటి పరిష్కారానికి అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లను తగ్గించేందుకే అధికారులు కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి ప్రస్తుత పరిస్థితుల్లో 127 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం 70 లక్షల టన్నులు కాగా, 80-90 లక్షల మధ్య వచ్చే అవకాశం ఉందని తెలిసింది. అయితే ఇంత భారీ మొత్తంలో ధాన్యం కొనుగోలు చేస్తే ప్రభుత్వంపై భారీగా ఆర్థిక భారం పడే ప్రమాదం ఉంది. సుమారు రూ.20 వేల కోట్ల నిధులు అవసరం. ఇంత భారీ మొత్తంలో వెచ్చించే పరిస్థితి లేకపోవడంతో కొనుగోళ్లలో కోత పెట్టేలా కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- ధాన్యం కొనాలని రాస్తారోకో



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)లోని సబ్‌మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వారం రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రధాన రోడ్డుపై బైఠాయించి వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చందర్‌గౌడ్ మాట్లాడుతూ వారం రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. -ఆత్మకూరు(ఎం)



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

## వ్యవసాయ యూనివర్సిటీకి భూములియ్యం

### బూరుగడ్డలో అధికారులను అడ్డుకున్న రైతులు

హుజూర్‌నగర్ రూరల్, మే 6 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటుకు తమ భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టంచేశారు. మంగళవారం ఉదయం భూసేకరణకు వచ్చిన రెవెన్యూ అధికారులు, పోలీసులను వారు అడ్డుకున్నారు. తాము సాగు చేసే భూములను ప్రభుత్వానికి ఇవ్వబోమని వారితో వాగ్వాదానికి దిగారు. హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డలో 604 సర్వే నంబర్‌లో 164 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, గతంలో సుమారు 60 మంది రైతులకు 60 ఎకరాలను ప్రభుత్వం పట్టాలు చేసి ఇచ్చిందని వారు తెలిపారు. మిగిలిన 100 ఎకరాలను రైతులను సాగు చేసుకుంటూ ప్రభుత్వానికి కౌలు చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఈ భూమి అంతా పెద్ద చెరువు ప్రాంతం కిందికి వస్తుందని, దాదాపు 30 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వానికి ఇవ్వబోమని రైతులు స్పష్టంచేశారు. కాగా 604 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేసేందుకు రాగా రైతులు వారిని అడ్డుకున్నారు. దీంతో భూసేకరణ సర్వే చేయకుండానే అధికారులు వెనుదిరిగారు. గతంలో హుజూర్‌నగర్‌లో పనిచేసిన తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ వారి కుటుంబ సభ్యుల పేరుమీద సుమారు 12ఎకరాల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

### భూములే మా జీవనాధారం



వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం మా పంట పొలాలను గుంజుకోవాలని చూస్తున్నది. ఏదేమైనా మేము మాత్రం భూములు ఇచ్చేది లేదు. మాకున్నదే 30 గుంటలు. దీనిపైనే ఆధారపడి బతుకుతున్నం. ఇది పోతే మాకు జీవనాధారం లేదు.

-ఆకుల గురవయ్య, రైతు, బూరుగడ్డ గ్రామం

## ఒకేసారి అన్ని సెటిల్‌మెంట్స్..

ఆర్టీసీలో రిటైరైన ఉద్యోగులకు సెటిల్‌మెంట్స్ వెంటనే విడుదల చేయకపోవడం, పెన్షన్ సౌకర్యం కూడా లేకపోవడంతో నెలవారీ జీతాలు లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దృష్టికి జేఏసీ తీసుకెళ్లింది. పాత బకాయితోపాటు కొత్తగా రిటైర్ అవుతున్నవారికి సెటిల్‌మెంట్స్ అన్నీ ఒకేసారి ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. 2017 వేతన సవరణ తర్వాత రిటైరైన ఉద్యోగులకు పే ఫిక్సేషన్ చేయిస్తామని, వారికి వేతన సవరణ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2019 సమ్మె కాలపు కేసులను ఎత్తివేయాలని జేఏసీ కోరగా, కేసులను ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీసీఎస్, పీఎఫ్ బకాయిలను చెల్లిస్తున్నదని, నెలనెలా సీసీఎస్‌కు ఎంఆర్‌డీఎఫ్ అమౌంట్ రూ.21 కోట్లను అందజేస్తున్నదని, త్వరలోనే మిగతా బకాయిలు కూడా ఇచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### తెలంగాణ రైతు సంఘం డిమాండ్

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుసంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి సాగర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, కొనుగోలును వేగంగా పూర్తి చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కోసం రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మిల్లర్లు తరుగు పేరుతో క్వింటాల్‌కు రెండు నుంచి 4కిలోల వరకు తగ్గిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల మొక్కజొన్న, వరి, మామిడి, కొబ్బరి, బొప్పాయి, కూరగాయలు, చెరుకు తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇస్తానన్న ప్రభుత్వం ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ప్రారంభించకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు తెలిపారు.

# పెట్టుబడుల ఆకర్షణకే మిస్ వరల్డ్ పోటీలు

- అందాల పోటీలతో రాష్ర్టానికి ప్రపంచస్థాయి గుర్తింపు: జూపల్లి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 ( నమస్తే తెలంగాణ ): తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయలను ప్రపంచస్థాయిలో తీసుకెళ్లేందుకు 72వ మిస్ వరల్డ్ పోటీలు ఉపయోగపడతాయని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇవి కేవలం అందాల పోటీలు మాత్రమే కాదని, తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. హైటెక్‌సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో మంగళవారం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ పెట్టుబడుల ఆకర్షణ, తెలంగాణ టూరిజం ప్రమోషన్ కోసమే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చాలా రాష్ర్టాలు ఈ పోటీలను నిర్వహించేందుకు పోటీ పడ్డాయని, చివరికి తెలంగాణ ఆ అవకాశం దక్కించుకుందని వివరించారు. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్ అండ్ సీఈవో జులియ మోర్లే మాట్లాడుతూ తెలంగాణలో అద్భుతమైన టూరిజం ఉందని, వరల్డ్ క్లాస్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు హైదరాబాద్‌కు ఉన్నాయని, అందుకే తెలంగాణను వేదికగా చేసుకున్నట్టు ఆమె పేర్కొన్నారు.

### దేశంలోనే అనువైన ప్రాంతం తెలంగాణ

సినీ నటుడు సోనూసూద్ తన ఫేమస్ డైలాగ్ 'పదల బొమ్మాళీ..' అంటూ మిస్ వరల్డ్ పోటీల గురించి ముచ్చటించారు. ఈ పోటీలు బ్యూటీ విత్ పర్పస్ అని పేర్కొన్నారు. చాలా అవార్డ్స్ ఫంక్షన్లలో పాల్గొన్నానని, కానీ ఈ మిస్ వరల్డ్ పోటీల్లో అతిథిగా హాజరవడం గొప్ప అవకాశంగా భావిస్తున్నట్టు వివరించారు. మిస్ వరల్డ్ పోటీలకు దేశంలో అనువైన ప్రాంతంగా తెలంగాణ ఒక్కటే ఉందని చెప్పారు. మిస్ ఇండియా నందిని గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణకు రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్ తనకెంతో ఇష్టమని చెప్పారు. ఈ పోటీల్లో సొంత గడ్డ నుంచి తాను కూడా పాల్గొనడం గొప్పగా ఉందని చెప్పారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలను అందరూ వీక్షించేలా అవకాశం కల్పించినట్టు తెలిపారు. పోటీలను వీక్షించాలనుకుంటున్న వారు www.telanganatourism.gov.inలో వివరాలు పంచుకుంటే, తాము పాస్‌లు జారీచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, గౌరవ్ కె.కుమార్ పాల్గొన్నారు.

- ధాన్యం బస్తాల తరలింపు



నమస్తే ఎఫెక్ట్

నర్సింహులపేట, మే 6 : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలోని కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను అధికారులు తరలించారు. 'కాంటా ఇంకెప్పుడు పెడ్తరు?' శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాంటాల నిర్వహణ పెంచాలని, లారీల్లో మిల్లులకు ధాన్యం తరలించాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో రెవెన్యూ అధికారులు జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపి ధాన్యం బస్తాలు తరలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం వచ్చిన 140మంది రైతులకు టోకెన్లు జారీచేశారు. సీరియల్ ప్రకారం మాత్రమే కాంటాలు నిర్వహించాలని, రైతుల పేర్లు బోర్డుపై అంటించడంతో రైతులు సంతృప్తి వ్యక్తంచేశారు.



- 25 రోజులైనా కాంటాలు పెట్టరా?

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. మార్కెట్‌కు ధాన్యం తెచ్చి 25 రోజులైనా కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. మంగళవారం మహబూబాబాద్ మండలంలోని శనిగపురం, ముడుపుగల్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. -మహబూబాబాద్ రూరల్

## మరో వారం రోజులు వానలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, మే 6(నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 12వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పలు జిల్లాల్లో కురుస్తాయని పేర్కొన్నది. భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీజేసినట్టు తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు వెల్లడించింది. రాష్ట్రంలో మూడ్రోజులు పలు జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు.